విక్టర్ ఈ. ఫ్రాంకిల్

# అర్థంకోసం అన్వేషణ

మీరు మరణించాలంటే చదవండి
జీవించాలంటే తప్పక చదవండి

తెలుగు సేత
అల్లు భాస్కరరెడ్డి

ఎమెస్కో

# విషయసూచిక


ముందుమాట –హరాల్డ్ ఎస్. కుష్నర్ 13

1992 ముద్రణకు ముందుమాట 17

మొదటిభాగం

*నిర్బంధ శిబిరంలో అనుభవాలు* 21

రెండవ భాగం

*క్లుప్తంగా లోగోథెరపీ అంటే* 103

మలి పలుకు 1984

*విషాదాంతర్గత ఆశావాదం కోసం* 135

**ఈ** గ్రంథం కేవలం ఏవో కొన్ని వాస్తవాలను, సన్నివేశాలను చిట్టాపద్దులాగ వివరించదు!

అసంఖ్యాక బందీల అనంతవ్యథల, వ్యక్తిగత అనుభవాల గాథ ఇది.

నిర్బంధ శిబిరాలలో మృత్యువుబారి నుండి బతికిబయటపడ్డ ఒక వ్యక్తి ఆంతరంగిక కథ ఇది.

ఈ కథ ఇప్పటికే చరిత్ర పుటలలో పాతబడిపోయిన దారుణ, మారణకాండను ప్రస్తావించదు; అయితే లెక్కలేనన్ని చిన్న హింసలతో నలిగిపోయిన, జీర్ణమయిన, విశీర్ణమయిన, ఛిద్రమైన బందీ కథ.

మరోవిధంగా చెప్పాలంటే ఇది ఒక ప్రశ్నకు జవాబు చెప్పాలని ప్రయత్నిస్తుంది: ఒక నిర్బంధ శిబిరంలోని రోజువారీ జీవితం సగటు ఖైదీ మనస్సుపై ఎటువంటి ముద్ర వేస్తుంది? అన్నది ఆ ప్రశ్న.

ఇక్కడ వర్ణించిన అనేక సంఘటనలు పెద్ద, ప్రఖ్యాత శిబిరాల్లో జరిగినవి కావు; వాస్తవానికి నిజమైన వినాశనం, విధ్వంసం సంభవించింది చిన్న శిబిరాలలోనే!

కథ మహావీరుల, అమరవీరుల కష్టాల్నీ, బలిదానాల్నీ వర్ణన చేయబోదు! అంతేకాదు; గార్డులకు నమ్మకస్థులుగా ఉండి ప్రత్యేక హక్కులు పొందిన కాపోలనే ఖైదీల గురించి అసలే కాదు. కనుక మహాయోధులు, బలవంతుల త్యాగాల గురించి చెప్పదు!

ఎందరో పేరు తెలియని, ఎక్కడా నమోదు కాని అసంఖ్యాక అభాగ్య బాధితుల బలవంతపు త్యాగాలు, శిలువ ఎక్కి మరణాన్ని కౌగలించుకున్న సంఘటనలను వర్ణిస్తుంది.

ఈ మామూలు ఖైదీలకు తినడానికి తిండి ఉండదు, 'కాపో'లకు ఆకలంటే ఏమిటో తెలియదు. వాస్తవానికి చాలా మంది కాపోల జీవనం బాహ్య ప్రపంచంలో కన్నా శిబిరంలోనే మెరుగ్గా ఉంటుందని చెప్పొచ్చు.

గార్డులు, ఎస్.ఎస్. పోలీసులకంటే ఈ 'కాపో'లు బందీల పట్ల ఎక్కువ క్రూరంగా, కఠినంగా వ్యవహరించేవారు. అందుకో కారణం ఉంది!

క్రూరత్వం, హింసించే తత్వం, పరాభవించే స్వభావాలలో బాగా ఆరితేరిన వారిని, సాధారణ ఖైదీల్లోంచే ఎన్నుకొని 'కాపో'లుగా నియమించేవారు. వాళ్ళలో ఏ కొద్ది సున్నితత్వం కన్పించినా, వెంటనే ఆ పదవి నుంచి తొలగించి మామూలు ఖైదీలుగా పరిగణించేవారు. కాపోలు కొద్దికాలంలోనే ఎస్.ఎస్‌లు, కాంపు వార్డెన్ల లాగా తయారయ్యేవారు, వారిని అటువంటి మానసిక ఆధారంతోనే పరిశీలించాలి.

వెలుపలి వ్యక్తికి నిర్బంధ శిబిర జీవితం గురించి తప్పుడు భావన కలగడం తేలిక. ఆ భావన భావోద్వేగంతోనూ, జాలితోనూ కూడుకొని ఉంటుంది.

బతుకు నిలుపుకోవడం కోసం ఖైదీల మధ్య జరిగే మహాపోరాటం వారు అర్థం చేసుకోలేరు.

ఆ పోరాటంలో ఏ పూటకాపూట కడుపు నింపుకోవాలని చేసే ఆరాటం ఉంటుంది.

పై పూటకి బ్రతికి ఉండాలని చేసే పోరాటం ఉంటుంది.

తనకోసం, తన స్నేహితులు అని భావించిన వాళ్ళ కోసం అనుక్షణం వీరోచిత పోరాటం ఇది. ఒక ఉదాహరణమిస్తాను.

ఒక శిబిరం నుండి మరో శిబిరానికి బందీల రవాణా సందర్భమొకటి చెబుతాను.

చిన్న చిన్న శిబిరాల నుండి బందీలను పెద్ద శిబిరాలకు తోలేవారు. అక్కడ వారిని విషవాయువులు నింపిన గదుల్లోకి తోసి, జీవిత సమస్యకు శాశ్వత విముక్తి కలిగిస్తారని తెలిసిన ఖైదీలు ఎవరికి వారు జీవన కాంక్షతో తమను తాము కాపాడుకోవడానికి పోరాడేవారు.

ప్రతిసారీ ఖైదీలను ఒకచోట నుంచి మరొకచోటికి మార్చేప్పుడు ఎందరుండాలో అధికారులు ఆదేశించేవారే కానీ వారెవ్వరు అని నిర్దేశించేవారు కాదు. దాంతో గొప్ప సంఘర్షణకు బందీలలో తెరదీసేట్టు అయ్యేది.

నిర్బంధ శిబిరాలలో ప్రతి ఖైదీకి ఒక సంఖ్య కేటాయిస్తారు. అది శిబిరానికి వచ్చిన రోజే జరుగుతుంది. బందీల సామాన్లన్నీ స్వాధీనం చేసుకొని వారి వంటి మీద, కేటాయించబడిన సంఖ్యను పచ్చ పొడుస్తారు. ఆ సంఖ్యనే వాళ్ళ దుస్తులపై కూడ కుట్టి ఉంచేవారు. దాంతో ఖైదీని గుర్తుపెట్టుకోవడం తేలికయ్యేది.

ఏ గార్డూ ఖైదీ పేరు అడిగేవాడు కాదు. వాళ్ళ దృష్టిలో మితిమీరి ప్రవర్తించిన ఖైదీ వంటిపై సంఖ్యను కళ్ళతోనే గుర్తుపెట్టుకొని వెళ్ళేవారు. కరుకైన తీక్షణమైన వారి దృష్టి మాలో భయం, ఆందోళన రేపేది. క్షణక్షణం బిక్కుబిక్కుమంటూ భరించేవాళ్ళం.

మళ్లీ బయలుదేరబోయే వాహనాల వద్దకు వద్దాం. నీతినియమాల గురించి ఆలోచించే సమయం ఎవరివద్దా లేదు. ప్రతి మనిషిలోనూ ఒక్కటే ఆలోచన. తన కోసం ఇంటివద్ద ఎదురుచూస్తున్న వారికోసం తాము బతకాలి. తన మిత్రుల్ని తాను బతికించుకోవాలి. అందువల్ల తన స్థానంలో మరో 'నంబరు'ను రవాణాకు ఏర్పాటుచేయాలి. ముందే చెప్పానుకదా! ముందే చెప్పాను కదా! కాపోలను ఎంచుకొనే పద్ధతి వారి చెడుపై ఆధారపడి ఉంటుందని; ఖైదీలలో అతిక్రూరుల్ని మాత్రమే ఎంచుకొనేవారు. ఎస్ఎస్‌లు కాపోలను ఎంపిక చేయడం ఒక వంతయితే, మరోవైపు వాళ్లను వాళ్లే ఎంపిక చేసుకొనే పద్ధతి ఒకటుంది. అనేక సంవత్సరాలు శిబిరం నుండి శిబిరానికి తిరుగుతూ బతుకుకోసం పోరాటంలో యుక్తాయుక్తి విచక్షణ కోల్పోయినవారు మాత్రమే సగటున జీవించగలుగుతారు; తమను తాము కాపాడుకోవడానికి వాళ్లేమైనా చేస్తారు, ధర్మాధర్మాలు చూడరు, క్రూరమైన శక్తిని ఉపయోగిస్తారు, దొంగతనం చేస్తారు, మిత్రులకు ద్రోహం చేస్తారు. అదృష్టవశాత్తూ ఎన్నో అవకాశాలుచిక్కి మేము తిరిగి వచ్చాం – మీరు దాన్నేమయినా అనండి, అదృష్టమో, అద్భుతమో – మాకు తెలుసు! మాలో అత్యుత్తములు తిరిగి రాలేదు.

నిర్బంధ శిబిరాల గురించి ఎన్నో వాస్తవాలు ఇప్పటికే చరిత్రపుటల్లో నమోదయ్యాయి.

కానీ, నేను చెప్తున్న ఈ కథనంలో ఒక మానవుడి అనుభవాన్ని దృష్టిలో ఉంచుకొని మాత్రమే వాస్తవాల ప్రాముఖ్యతను నిర్ధారించాను. ఆ అనుభవాల వెనక